

చదువులకు చేయూత

డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం
'ఎన్టీఆర్ విద్యాసంకల్పం' అమలుకు శ్రీకారం
త్వరలో ప్రారంభించనున్న సీఎం
(వివరాలు 6లో..)



పోటెత్తిన వరద

- నదీ పరివాహక ప్రాంత ప్రజల అప్రమత్తం
- హెచ్చెల్సీ పనులు పరిశీలించిన అధికారులు

తుంగభద్రకు 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం


రాయదుర్గం/బళ్లారి సిటీ/బొమ్మనహాళ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో నీటి నిల్వ 61 టీఎంసీలు దాటింది. గత ఏడాది ఇదే సమయంలో జలాశయంలో 5 టీఎంసీలు మాత్రమే ఉండేది. ఈ ఏడాది డ్యాంలో 80 టీఎంసీలే నిల్వ చేయాలని అధికారులు నిర్ణయించారు. క్రస్ట్‌గేట్ల బలహీనత వల్ల ఈ ఏడాది 20 టీఎంసీల నీటి నిల్వను తగ్గించారు.

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల డ్యాంకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. నీటి నిల్వ 60 టీఎంసీలు దాటితే క్రస్ట్‌గేట్ల ద్వారా నదికి వదిలేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్యాం పరిసర ప్రాంతాల్లో ప్రజలను బోర్డు అధికారులు అప్రమత్తం చేశారు. ముఖ్యంగా శుక్రవారం బెంగళూరులో జరిగిన కర్ణాటక జలమండలి సమావేశంలో జూలై 10 నుంచి కర్ణాటక వాటా నీటిని విడుదల చేయాలని తీర్మానించారు. ఆంధ్ర సరిహద్దులో 105వ కి.మీ నుంచి హెచ్చెల్సీకి చేపట్టిన మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. వీటిని రూ.35 కోట్లతో చేపట్టారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలలోని యూటీలు ఇప్పటికే స్లాబ్‌లు పూర్తి చేసుకుని క్యూరింగ్‌దశకు చేరుకున్నాయి. లైనింగ్ మరమ్మతు పనులతో పాటు లెవెలింగ్, గట్ల పటిష్టత పనులు చురుకుగా సాగుతున్నాయి. జూలై 15 నుంచి హెచ్చెల్సీకి నీటిని తీసుకోవాలని ఇప్పటికే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.



పనులను పరిశీలిస్తున్న సీఈఈ, ఈఈ

తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం



ఏ క్షణంలోనైనా నదికి నీరు

తుంగభద్ర జలాశయానికి 60 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో ఉండటంతో, డ్యాంలో నీటి నిల్వ 61 టీఎంసీలు దాటింది. దీంతో ఆనకట్ట భద్రత దృష్ట్యా ఏ క్షణంలోనైనా నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. క్రస్ట్‌గేట్లు ఎత్తి 25,000 క్యూసెక్‌ల నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అందు వల్ల డ్యాం దిగువన నది ఒడ్డున నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగ భద్ర బోర్డు శనివారం అత్యవసర బులెటిన్‌లో పేర్కొంది.

60 శాతం పనులు పూర్తి

మండలంలోని బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో 115వ కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు జరుగుతున్న అత్యవసర మరమ్మతు పనులను హెచ్చెల్సీ సీఈఈ నాగరాజు, ఈఈ పార్థసారథి, కణేకల్లు డీఈఈ దివాకర్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2025 ఖరీఫ్ సాగులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామన్నారు. అనంతరం నాగలాపురం వద్ద జరుగుతున్నా వంతెన, లైనింగ్ పనులను పరిశీలించారు. నాణ్యతపై కాంట్రాక్టర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. వారి వెంట జేఈఈ అల్తాఫ్ ఉన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి చార్జ్ మెమో

- నీకింత.. నాకింత కథనానికి స్పందన



ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బుక్కరాయసముద్రం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న 23 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు చార్జ్‌మెమోలు ఇచ్చినట్లు ఎంపీడీఓ సాల్మన్ రాజ్ తెలిపారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓ సుజాత, కంప్యూటర్ అపరేటర్లతో ఎంపీడీఓ శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులపై విచారణ చేపడతామన్నారు. ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు తేలితే.. సస్పెండ్‌తో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. చార్జ్ మెమోలతో సరిపెట్టనని, విచారణలో అక్రమాలు తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. పని వద్దకు కూలీలు రాకున్న మస్టర్‌లో పేరు రాస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నుంచి ఫీల్డ్ విజిట్ చేస్తానని వెల్లడించారు. పంచాయతీలలో ఏ నాయకుడికి ఒక్క పైసా కూడా ఇవ్వ వద్దని సూచించారు.

ఆషాఢానికి చిక్కిన పట్టు

- నిలిచిన పట్టుచీరల విక్రయాలు
- నెలన్నరపాటు అరకొర అమ్మకాలే
- ముహూర్తాలు లేకపోవడమే కారణం
- ఇబ్బందుల్లో చేనేతలు, మాస్టర్ వీవర్స్





పది రోజుల నుంచి కొనేవారు లేక షాపులో నిల్వఉన్న పట్టుచీరలు

ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆషాఢం నేతన్న ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈనెలలో శుభముహూర్తాలు లేకపోవడంతో నేసిన చీరలు అమ్ముడుపోక ఇబ్బందిపడుతున్నారు. శుభ ముహూర్తాల సీజన్ వస్తే చాలు ధర్మవరంలో ప్రతినెలా రూ.15 కోట్ల నుంచి రూ.20కోట్ల లావాదేవీలు జరుగుతుంటాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో రూ.5కోట్ల నుంచి రూ.10కోట్లలోపు కూడా క్రయ విక్రయాలు జరిగే పరిస్థితి లేదని చేనేత కార్మికులు, మాస్టర్‌వీవర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షోభంలో పరిశ్రమ

చేనేత పరిశ్రమలో నేతన్నల సంఖ్య తగ్గిపోవడం, గతంతో పోలిస్తే ఉత్పత్తి భారీగా పడిపోవడంతో నేతన్న చీరలకు డిమాండ్ పెరిగింది. 15 సంవత్సరాల కిందట చేనేత పరిశ్రమలో మంచి గిట్టుబాటు ఉండటం వల్ల అన్ని కులాలు, మతాల వారు ఈ చేనేత వృత్తిలోకి వచ్చారు. అప్పట్లో ముడిసరుకుల ధరలు కూడా నిలకడగా ఉండటం. పవర్‌లూమ్స్ చీరలు నామమాత్రంగానే ఉండటం వల్ల ప్రతి చేనేత కార్మికుడికి మంచి ఉపాధి దొరికేది. రానురాను ముడి సరుకుల ధరలు పెరగడం, అందుకు అనుగుణంగా చీరధర పెరగకపోవడంతో పట్టు పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. గతంలో జిల్లా వ్యాప్తంగా 75వేల మగ్గాలుండగా, ప్రస్తుతం 25 వేలలోపే ఉన్నాయంటే చేనేత పరిశ్రమ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ధర్మవరంలో దాదాపు 12వేల మగ్గాలు నడుస్తున్నారు. వారు కూడా పరిశ్రమపై దృష్టి సారించలేకపోవడం, పిల్లలను ఉన్నత చదువుల వైపు పంపడం, ఇతర వృత్తులు నేర్పించడం వల్ల మగ్గాల సంఖ్య ఇంకా తగ్గే అవకాశం ఉంది.

భారీగా ఎగుమతులు

ధర్మవరంలో నేతన్న నేసిన చీరలు ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. ప్రధానంగా కర్ణాటక, ముంబై, కొయంబత్తూరు, కోల్‌కతా, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆషాఢం నెల ప్రారంభమడం, శుభదినాలు లేకపోవడంతో మరో నెలన్నర రోజుల వరకు అన్ సీజన్ కొనసాగనుంది. అందుకే బడా వ్యాపారులు (మిగతా 6లో..)

బదిలీల్లో గందరగోళం..!

తొలుత సీనియార్టీ జాబితా మేరకు...

మధ్యాహ్నం నుంచి ర్యాంక్‌ల వారీగా కౌన్సెలింగ్
గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో సిఫార్సులు
లేఖలు జతచేయని వారికి అన్యాయం 7

ఉనికి కోసమే ప్రభుత్వంపై విషప్రచారం

- వైసీపీ అధికారంలోకి వచ్చేదీ లేదు.. జైళ్లలో వేసేదీ లేదు..
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు పార్టీ ఉనికి కోసం కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఇతర నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి హామీల్లో 80 శాతం అమలు చేస్తోందన్నారు. తమ పార్టీని ప్రజలు ఎక్కడ మర్చిపోతారో... ఉనికే లేకుండా పోతుందేమోనన్న భయంతోనే వైసీపీ నాయకులు.. కూటమిపై విషప్రచారం చేస్తున్నారన్నారు. జిల్లాకు వచ్చిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తాము అధికారంలోకి వస్తే... ఆరు నెలల్లో జైళ్లలో వేస్తాం అంటూ మాట్లాడడం శోచనీయమన్నారు. వైసీపీ అధికారంలోని వచ్చేదీ లేదు... టీడీపీ నేతలను జైళ్లలో వేసేదీ లేదంటూ ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో చేసిన స్కాంల కారణంగా అధికారులతోపాటు, చాలామంది వైసీపీ నేతలు జైళ్ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. భారీ మద్యం స్కాంలో ఆధారాలతో సహా అధికారులు, వైసీపీ బ్యాచ్‌ను అరెస్టు చేసి జైళ్లకు పంపుతోందన్నారు. ఇంకా ఇలానే మాట్లాడితే.... మరోసారి ప్రజలే బుద్ధి చెబుతారంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాజుల ఆదెన్న, తలారి ఆదినారాయణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, రాష్ట్ర కురుబ సాధికార సమితి సభ్యుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి సాయం

- మెరిట్ స్కాలర్‌షిప్‌నకు రూ.12.84 లక్షలు



ఆర్థికసాయం చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి

అనంతపురంరూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు మెరిట్ స్కాలర్ షిప్‌కు పూర్వ విద్యార్థి శంకరనారాయణ రూ.12.84 లక్షలు ఆర్థికసాయం చేశారు. శనివారం వీసీ సుదర్శన్‌రావు చేతుల మీదుగా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డికి చెక్కు అందజేశారు. వీసీ మాట్లాడుతూ.. శంకరనారాయణ 1970లో ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ విభాగంలో చదివారన్నారు. పేద విద్యార్థినులకు సాయం చేయడం హర్షణీయమన్నారు. 2024లో చేరిన ఆరు బ్రాంచులలోని ఈడబ్ల్యూఎస్, 2023లో చేరిన విద్యార్థినులు (ఎన్‌సీసీ సర్టిఫికెట్) ఉన్న మొత్తం 12 మంది విద్యార్థినులకు ఈ సాయం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డైరెక్టర్ సుజాత, రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్ పాల్గొన్నారు.

పక్కనే కలెక్టరేట్.. సో.. వాట్..!

వయోజన విద్యాశాఖలో ఇష్టారాజ్యం
హాజరు వేసి.. వెళ్లిపోయిన అధికారులు, ఉద్యోగులు
వెలుగుతున్న లైట్లు.. తిరుగుతున్న ఫ్యాన్లు

అనంతపురం విద్య, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోనే వయోజన విద్యాశాఖ ఉప సంచాలకుడు (డీడీ) కార్యాలయం ఉంటుంది. జిల్లాలో అక్షరాస్యత పెంచాల్సిన కీలక బాధ్యత ఈ శాఖపై ఉంటుంది. జిల్లా అభివృద్ధికి అక్షరాస్యత అవసరం కూడా. అంతటి ప్రధాన శాఖ జిల్లా కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆడిందే ఆటగా తయారైంది. అలా వచ్చి.. హాజరు వేసి.. ఇలా వెళ్లిపోతున్నారు. శనివారం ఉదయం 11.18 గంటల సమయంలో కార్యాలయానికి 'ఆంధ్రజ్యోతి' వెళ్లింది. కార్యాలయంలో లైట్లు వెలుగుతున్నాయి. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. ఏ ఒక్కరూ లేరు. అధికారుల చాంబర్ల తలుపులు సగం తెరిచి ఉన్నాయి. ఉద్యోగులు కనిపించలేదు. కనీసం సిబ్బంది కూడా లేరు. ఒక్కరంటే ఒక్కరు కూడా కనిపించలేదు. ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఆఫీసును దోచుకెళ్లినా దిక్కులేదు. వెళ్తూ.. వెళ్తూ.. ఫ్యాన్లు, లైట్లు కూడా ఆఫ్ చేయలేదంటే ఎంత బాధ్యతగా పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక ఉప సంచాలకుడు (డీడీ) చాంబర్ తలుపులు సగం తెరిచి ఉన్నాయి. ఇక్కడ ఉండాల్సిన ఏపీఓ, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, చివరకు అటెండర్ కూడా కనిపించలేకుండా పోయారు. మండలాల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు టీచర్లను సూపర్‌వైజర్లుగా నియమించారు. వారు కార్యాలయానికి వచ్చి ఇక్కడి నుంచి ఫీల్డ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. వారు కూడా ఆఫీసులో కనిపించలేదంటే వయోజన విద్యాశాఖ కార్యాలయం నిర్వహణ ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న కార్యాలయంలోనే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం శోచనీయం.



సగం తెరుచుకున్న డీడీ చాంబర్ తలుపులు



ఆంధ్రజ్యోతి విజిట్

వయోజన విద్యాశాఖ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు, వెలుగుతున్న లైట్లు, తిరుగుతున్న ఫ్యాన్లు

పింఛన్ల పంపిణీకి సన్నద్ధం కండి

వీసీలో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీకి సన్నద్ధం కావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఆయన జూలై 1న పంపిణీ చేసే పింఛన్లకు సంబంధించి సన్నద్ధతపై డీఆర్‌డీఏ పీడీ, డీఎస్ఓ, సివిల్ సప్లైస్ డీఎం, ఎల్డీఎం, ఆర్డీఓలు, బ్యాంకు నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఎస్డీటీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు.



అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1న ఉదయం 7గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. లబ్దిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలన్నారు. 30వతేదీకి బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి ఐవీఆర్ఎస్ కాల్స్ ఫీడ్ బ్యాక్ ప్రతి నెలా వస్తుందని, నెగిటివ్ ఫీడ్ రాకుండా జాగ్రత్తగా పింఛన్లను పంపిణీ చేయాలన్నారు. పంపిణీ కాని పింఛన్లను రెండ్రోజుల్లో బ్యాంకుకు తిరిగి కట్టాలన్నారు. అన్ని ఎఫ్‌పీ షాపులకు పెండింగ్ లేకుండా రేషన్ సరుకులను వెంటనే అందజేయాలన్నారు. ఒకటో తేదీన ఎఫ్‌పీ షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇట్లయితే నావల్ల కాదు

- వెల్ఫేర్ అసిస్టెంట్లపై డీడీ అసహనం
- ఖాళీలపై వివాదంతో కౌన్సెలింగ్ నేటికి వాయిదా

అనంతపురం విద్య, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అయ్యయ్యో..! ఇట్ల అల్లరి చేస్తే కౌన్సెలింగ్ నిర్వహించడం నావల్ల కాదంటూ సోషల్ వెల్ఫేర్‌శాఖ డీడీ రామాంజనేయులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం గ్రామ, వార్డు సచివాలయాల సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు బదిలీల ప్రక్రియ చేపట్టారు. మధ్యాహ్నం నుంచి డీడీ రామాంజనేయులు, ఏఎస్‌డబ్ల్యూఓ దామోదరరెడ్డి తదతరులు కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. ఉద్యోగులు కోరుకున్న స్థానాలు ఇవ్వకపోవడంతో వివాదం మొదలైంది. ఖాళీలు అన్నీ చూపించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లు పట్టుబట్టారు. ఈవివాదం దాదాపు నాలుగు గంటల పాటు సాగింది. రాత్రి 8గంటలు అయినా సచివాలయ ఉద్యోగులు అక్కడే ఉంటూ నిరసన తెలిపారు. చివరకు కలెక్టరు వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో డీడీ రామాంజనేయులు కౌన్సెలింగ్‌ను ఆదివారానికి వాయిదా వేశారు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదనతో వెనుదిరిగారు.





చేతులెత్తేసిన సోషల్ వెల్ఫేర్ డీడీ రామాంజనేయులు, ఆందోళన చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

జాకీ పోయె.. రేమండ్ వచ్చె..!

రాప్తాడు వద్ద కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థ
3 వేల మందికి ఉపాధి
రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే పరిటాల సునీత
(వివరాలు 6లో..)

సార్.. అన్యాయం చేయొద్దు..!

- పశుసంవర్ధక శాఖ సహాయకుల నిరసన
- బదిలీల్లో నిబంధనలు పాటించాలని విన్నపం
- అంతా నా ఇష్టం అంటున్న జేడీ
- జిల్లా కలెక్టర్‌కు సంఘం నాయకుల ఫిర్యాదు

అనంతపురం అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి నిబంధనలు పాటించడం లేదని పశుసంవర్ధక సహాయకుల సంఘం నాయకులు ఆరోపించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో పలువురు పశుసంవర్ధక సహాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జేడీ చాంబర్‌లోకి వెళ్లి బదిలీల్లో అన్యాయం చేయడం సరికాదని (మిగతా 7లో...)



బదిలీల సమస్యలపై పశుసంవర్ధక శాఖ జేడీతో వాదిస్తున్న పశుసంవర్ధక సహాయకుల సంఘం నాయకులు

రిక్వెస్టులలో వాస్తవమెంత?

ఇష్టారాజ్యంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు
ప్రతిభావంతులకు తీవ్ర అన్యాయం
అధికారులతో నేతల వాగ్వాదం
కౌన్సెలింగ్ వాయిదా

అనంతపురం న్యూటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి శనివారం నిర్వహించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ఇష్టారాజ్యంగా సాగింది. స్పౌస్, మెడికల్ కేటగిరీల దరఖాస్తులను తనిఖీ చేయకపోవడంతో సమస్య మొదలైంది. కుప్పలుతెప్పలుగా రిక్వెస్టులు వచ్చాయి. నాయకుల సిఫార్సు లేఖలతో దీమాగా ఉన్నవారికి, ప్రతిభ ఉండి మొదటి ర్యాంకులో ఉన్నవారికి షాక్ తగిలింది. వీరిద్దరు పెట్టుకున్న ఆప్షన్లను రిక్వెస్టు కేటగిరీ వారు (మిగతా 7లో...)



ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ



ముంచుతున్న స్మార్ట్‌ఫోన్..!

నగరంలో ఇద్దరు యువకుల అదృశ్యం

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్‌లు విద్యార్థులు, యువత జీవితంపై చెడు ప్రభావాన్ని చూపుతున్నాయి. చదువులను పక్కనబెట్టి నిత్యం ఫోన్‌లలో మునిగిపోతున్నారు. తల్లిదండ్రులు మందలిస్తే ఇళ్ల నుంచి పారిపోతున్నారు. అనంతపురం నగరంలో తాజాగా ఇద్దరు యువకులు తల్లిదండ్రులు మందలించారని ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. నిర్మలానంద నగర్‌కు మహమ్మద్ రఫీ(19) ఇంటర్ పూర్తి చేశాడు. తనకు ఐ ఫోన్ కొనివ్వాలని ఇటీవల తల్లిని అడిగాడు. ఇప్పటికే సెల్‌ఫోన్‌లో ఎక్కువగా గడుపుతున్నావని, ఖరీదైన ఐ ఫోన్ ఎందుకు అని ఆమె సున్నితంగా మందలించారు. బాగా చదువుకుంటే కొనిస్తానని నచ్చజెప్పారు. అయినా, తల్లి మీద అలిగి ఇంటి నుంచీ వెళ్లిపోయాడు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. కాగా, సంగమేష్ నగర్‌కు చెందిన సతీష్(19) నగరంలోని ఓ డీజే షాప్‌లో పని చేస్తుంటాడు. పబ్జీ ఫ్రీ ఫైర్ గేమ్ ఎక్కువగా ఆడుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా

పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీ పాసులు



ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. పట్టణాల్లోని విద్యాసంస్థలకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చు భారంగా మారుతోంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాస్‌లు వరంగా మారాయి. 10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇంటర్, ఆపై చదువుకుంటున్న విద్యార్థులకు రాయితీ పాసులు ఇస్తున్నారు. ఆర్టీసీలో రాయితీ పాసులు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా నగదు చెల్లిస్తుంది.

దరఖాస్తు ఇలా..

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీతో ప్రయాణించాలంటే విద్యార్థులు ముందుగా పాస్‌లు పొందాలి. ఆయా బస్టాండ్లలోని బస్సు పాస్ కౌంటర్లలో వాటిని జారీ చేస్తారు. ఉచిత పాస్‌లు పొందాలనుకునే వారు ఆధార్‌కార్డు, పాఠశాలలో హెచ్‌ఎం ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో కౌంటర్ వద్దకెళ్లాలి. రాయితీ పాస్‌లకు ఇంటర్ విద్యార్థులు ఆధార్‌కార్డు, పదో తరగతి హాల్ టికెట్, దరఖాస్తుతోపాటు జతచేయాలి. ఆపై తరగతులు చదివేవారు ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి. వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాస్‌లను ఆర్టీసీ అందిస్తోంది. గతంలో నెలకోసారి విద్యార్థులు పాస్‌లను రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు నెలకు, మూడునెలల వరకు కూడా పొందవచ్చు.

రాయితీ పాసుల రుసుము వివరాలిలా..

దూరం (కి.మీ)	నెలకు (రూ.లలో)	3 నెలలకు (రూ.లలో)
0-5	140	400
5-10	190	555
10-15	240	705
15-20	315	930
20-25	400	1,185
25-30	435	1,290
30-35	475	1,410
35-40	565	1,680
40-45	645	1,920
45-50	735	2,190

సత్యసాయి ప్రేమతత్వంతో వైద్యసేవలు

వైట్ ఫీల్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్

పుట్టపర్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమతత్వంతో కూడిన వైద్యసేవలు అందిస్తున్నామని వైట్‌ఫీల్డ్‌లోని శ్రీసత్యసాయి సూపర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్ పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం శ్రీసత్యసాయి హెల్త్ కేర్ గ్లోబల్ కౌన్సిల్ నిర్వహించారు. వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి డైరెక్టర్ మాట్లాడుతూ... సత్యసాయి ప్రేమతత్వంతో పేద, ధనిక, కులమత బేధాలు లేకుండా అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం సత్యసాయి హెల్త్‌కేర్ పుస్తకాన్ని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్.. సభ్యులు నాగానందం, డాక్టర్ మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. వైద్యసేవలను మరింత విస్తరించేందుకు చికాగో, టోక్యో హెల్త్ యూనివర్సిటీలతో ఎంఓయూలు చేసుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వైద్యబృందం గాన కచేరి నిర్వహించింది. సదస్సులో ప్రశాంతిగ్రామం, వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్‌కేర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టుసభ్యులు



చేనేత కార్మికుడు నేసిన పట్టుచీర

ఆషాఢానికి చిక్కిన పట్టు

(5వ పేజీ తరువాయి)

చేనేతల నుంచి తయారు చేసిన చీరలను తెప్పించుకుని, సీజన్ రాగానే వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మామూలు రోజుల్లో అంతంతమాత్రమే..



పవర్‌లూమ్స్ విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తుండటంతో మామూలు రోజుల్లో కూడా మేము నేసిన చీరలకు అంతంత మాత్రమే డిమాండ్ ఉండేది. ఇప్పుడు ఆషాఢం రావడంతో కొనేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. వీటి వల్ల మాస్టర్ వీవర్స్ పూర్తి స్థాయిలో పనులు కల్పించకపోవడం వల్ల పొట్టకూటికోసం మరో నెలన్నర పాటు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తప్పడంలేదు. ఇలాంటి అన్‌సీజన్ సమయాల్లో పనులు లేక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- జింకా కేశవ, చేనేత కార్మికుడు

వెంటాడుతున్న అన్‌సీజన్



గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదారు సంవత్సరాల నుంచి చేనేత పరిశ్రమను సీజన్, అన్‌సీజన్ వెంటాడుతున్నాయి. ప్రస్తుతం అన్‌సీజన్ రావడంతో ఉత్పత్తులు భారీగా పెరిగిపోతుండటంతో మాస్టర్ వీవర్స్ ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటోంది. దీంతో మా లాంటికార్మికులకు పూర్తి స్థాయిలో పనులు అప్పగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. మళ్లీ సీజన్ రావడానికి దాదాపు నెలన్నర రోజులు పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి రావడం మా దౌర్భాగ్యమే.

-శ్రీనివాసులు, చేనేత కార్మికుడు

ఉనికి కోసమే వైసీపీ వెంపర్లాట

● ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు

అనంతపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న నేపథ్యంలో... ప్రజల్లో ఉనికి కోల్పోతామేమోనన్న భయంతో వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల విమర్శలపై టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో కలిసి శనివారం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రజలు చక్కగా పాలన చేయమని అధికారమిస్తే.. ఐదేళ్లు దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా వైసీపీ నాయకులు పనిచేశారని విమర్శించారు. ఆ అవినీతి కేసుల్లో ఒక్కొక్కరుగా వైసీపీ నాయకులు జైళ్లకు వెళ్తున్న పరిస్థితుల్లో ప్రజల్లో చులకన అవుతామేమోనన్న భయం ఆ పార్టీ నాయకులకు పట్టుకుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తమ మా నాయకుడు లోకేశ్ రెడ్‌బుక్ ప్రస్తావన లేకుండా రోజు గడవని పరిస్థితుల్లో వైసీపీ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎవరి ప్రభుత్వ హయాంలో రక్షణలేకుండా పోయిందో ప్రజలకు తెలిసే వైసీపీకి ప్రతిపక్ష హోదాకూడా ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తుపెట్టుకుని మాట్లాడితే మంచిదని ఆయన హితవు పలికారు.

పెద్దపప్పూరు ఘటనపై ఎస్పీ విచారణ

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు ఘటనపై విచారణ చేయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపప్పూరు యువకుడు వంశీని పోలీసులు కొట్టినట్లు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఘటనపై విచారణకు ఆదేశించిన ట్లు పేర్కొన్నారు. విచారణాధికారిగా తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ ఘటనపై సమగ్రం గా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

చదువులకు చేయూత

ద్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

'ఎన్టీఆర్ విద్యాసంకల్పం' అమలుకు శ్రీకారం

త్వరలో ప్రారంభించనున్న సీఎం



మహిళా సంఘాల సభ్యులు

అనంతపురం అర్బన్/ఉరవకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తపథకానికి రూపకల్పన చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకంలో భాగంగా స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణం మంజూరు చేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధిచిన విధివిధానాలను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పథకం ద్వారా డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు చేదోడు లభించనుంది. విద్యావికాసానికి దోహదపడేందుకు 35 పైసల వడ్డీతో స్త్రీనిధి రుణాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా ప్రతి ఏడాది రూ.200కోట్లు ఖర్చు చేసే విధంగా విధివిధానాలను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 31 మండల సమాఖ్యలు, 35,561 స్వయం సహాయక సంఘాలు, 1330 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,55,550 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది ఈ పథకం ద్వారా రూ.20 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. తద్వారా జిల్లాలోని రెండు వేల మందికిపైగా డ్వాక్రా మహిళల పిల్లలకు లబ్ధిచేకూరనుంది.

పథకం వర్తించేదిలా..

ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా డ్వాక్రా మహిళల పిల్లల చదువుల కోసం 35 పైసలు వడ్డీతో రెండు నుంచి మూడు సంవత్సరాల కాల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు, ఇతర రకాల కోర్సులు చదివే డ్వాక్రా మహిళల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో చదివే విద్యార్థులైనా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్యాసామాగ్రి, విద్యార్థులకు కావాల్సిన ఇతర సామాగ్రిని కొనుగోలుకు రుణాన్ని ఖర్చు చేయాలన్న నిబంధన విధించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సైకిళ్లను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. పిల్లల చదువుల కోసం ఖర్చుపెట్టిన వివరాలకు సంబంధించి తగిన రసీదులను స్త్రీనిధి అధికారులకు అందించాల్సి ఉంటుంది. డ్వాక్రా సంఘాల్లోని సభ్యులందరూ పథకానికి అర్హులు. వారి పిల్లల అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకూ స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు.



పేద కుటుంబాలకు ఊరట



స్త్రీనిధి పథకం ద్వారా పిల్లల చదువుకు రూ.లక్ష దాకా రుణం పొందే అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడం సంతోషంగా ఉంది. పిల్లల చదువు కోసం ఈ కొత్త పథకం ఉపయోగపడుతుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాం. బయట వడ్డీలకు తెచ్చి పిల్లలను చదివించుకునే మాలాంటి వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగం. 35 పైసల వడ్డీకే రూ.లక్ష వరకు రుణం ఇవ్వాలని సీఎం నిర్ణయం తీసుకోవడంతో పేద కుటుంబాలకు ఊరట లభిస్తుంది.

-మంజుల, డ్వాక్రా సభ్యురాలు, రాచేపల్లి, ఉరవకొండ మండలం

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం



ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా పిల్లల చదువులకు రుణాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగుంది. ఇప్పటికే తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉన్నా ఇస్తున్నారు. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుల కోసం తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం. పేద కుటుంబాలకు ఈ పథకం భరోసా కల్పిస్తుంది.

-సునీత, మోపిడి, ఉరవకొండ మండలం

పేద విద్యార్థులకు ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకు చేయూతనిచ్చేందుకు ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో స్త్రీనిధి ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చేవారు. ఈసారి ఆ తరహా రుణాలతోపాటు, డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా రుణ సదుపాయం కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకూ స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు. కేవలం 35పైసల వడ్డీతో 2 నుంచి 3 సంవత్సరాల కాల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు, ఇతర రకాల కోర్సులు చదివే డ్వాక్రా మహిళల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

-శైలజ, పీడీ, డీఆర్‌డీఏ

సస్య రక్షణతోనే అధిక దిగుబడి

● వ్యవసాయ అధికారి పెన్నయ్య



హెచ్ పెన్నయ్య, వ్యవసాయ అధికారి

విడపనకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు కంది సాగుకు సిద్ధం అవుతున్నారు. సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని విడపనకల్లు వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య పేర్కొన్నారు. పంట సాగులో విత్తు సమయం నుంచి దిగుబడి వచ్చే వరకూ రైతులు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలపై ఆయన వివరించారు.

ప్రశ్న: కంది సాగుకు ఎటువంటి నేలలు అనుకూలం?

జవాబు: నీరు త్వరగా ఇంకి పోయే ఎర్ర నేలలు, గరుసు నేలలు, నీరు పారే వసతి గల నల్లరేగడి నేలలు కంది పంట సాగు చేయుటకు అనుకూలం.

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: ఏకాలంలో సాగు చేస్తే కంది దిగుబడి బాగా వస్తుంది?

జవాబు: జూన్ నెల నుంచి జూలై నెల చివరి వరకూ కంది పంటను సాగు చేయవచ్చు. అది కూడా తక్కువ వర్షం ఉన్న సమయంలో విత్తనం వేయాలి. జూన్, జూలై నెలల్లో విత్తనం సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ప్రశ్న: ఏ రకం విత్తనాలు మంచి దిగుబడి ఇస్తాయి?

జవాబు: ఎల్ ఆర్‌జీ-52, ఎల్‌ఆర్‌జీ-105, ఆశ (ఐసీపీఎల్87119) అనే రకాలు మన నేలకు అనుకూలమైనవి. వీటి పంట కాలం 170 నుంచి 180 రోజులు.

ప్రశ్న: ఎకరాకు ఎన్ని కిలోల విత్తనం వేయాలి ?

జవాబు: ఎకరాకు 4 నుంచి 6 కిలోలను విత్తుకోవాలి. వ్యవసాయాధికారుల సలహా మేరకు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. పంటకు తెగుళ్లు ఆశించకుండా తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలి.

ప్రశ్న: సాలుకు సాలుకు మధ్య ఎంత దూరం ఉండాలి?

జవాబు: నల్ల రేగడి నేలలో అయితే సాలుకు సాలుకు మధ్య దూరం 180 సెంటి మీటర్లు, మొక్కకు మొక్కకు 20 సెంటి మీటర్లు దూరం ఉండాలి. ఎర్ర నేలల్లో అయితే సాలుకు సాలుకు 90 సెంటీ మీటర్లు దూరం, మొక్కకు మొక్కకు 20 సెంటి మీటర్లు దూరం ఉండేలా విత్తనాన్ని సాగు చేయాలి.

జాకీ పోయె.. రేమండ్ వచ్చె..!

● రాప్తాడు వద్ద కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థ ● 3 వేల మందికి ఉపాధి

● రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనలో తెలంగాణకు తరలిపోయిన జాకీ పరిశ్రమ స్థానంలో.. రేమండ్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. రాప్తాడు నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. జాకీ ప్రతినిధులను కాసులకోసం బెదిరించిన నేపథ్యంలోనే.. ఆ సంస్థ తెలంగాణకు తరలిపోయిందన్న ఆరోపణలు వినిపించాయి. అధికార మార్పిడి నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, రాప్తాడు నియోజకవర్గం నుంచి పరిటాల సునీత విజయం సాధించిన విషయం తెలిసిందే. పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా... జాకీ పరిశ్రమ స్థానంలో మరొకటి తీసుకొచ్చి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దానిని నిలబెట్టుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామం. రూ.330 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. తద్వారా దాదాపు 3వేల మందికి ఉపాధి లభించనుంది. దీంతో రాప్తాడు నియోజకవర్గ పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు పడినట్లయిందనడంలో సందేహం లేదు.

26.87 ఎకరాల్లో...

రాప్తాడు వద్ద 26.87 ఎకరాల్లో రేమండ్ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఎకరా రూ.20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం స్థిర మూలధన పెట్టుబడి కింద రూ.330 కోట్లను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు దానిపై ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటుద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుంది. ఇటీవల దాదాలూరు వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించారు. ఆ ప్రాంతానికి మరికొన్ని కంపెనీలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

మాట నిలబెట్టుకున్నాం

ఎన్నికల హామీ మేరకు జాకీ స్థానంలో ప్రఖ్యాత గార్మెంట్ పరిశ్రమ రేమండ్‌ను తీసుకొచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం.. వైసీపీ ప్రభుత్వంలోకి రావడం జరిగిపోయాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని సోదరులు జాకీ సంస్థను బెదిరించడంతో.. తెలంగాణకు వెళ్లిపోయింది. మరో గార్మెంట్ సంస్థను తీసుకొస్తామంటూ ఐదేళ్లు తోపు కుటుంబం కాలం గడిపింది. జాకీ పరిశ్రమను తిరిగి రప్పించడంగానీ, అదే స్థానంలో మరొకటి తీసుకొస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. దానిని నిలబెట్టుకున్నాం. చెన్నేకొత్తపల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు 4వేల ఎకరాలు అనువైన భూమి ఉంది. అక్కడి రైతులను ఒప్పించి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఓవైపు హంద్రీనీవా ద్వారా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తూనే.. మరోవైపు పారిశ్రామికీకరణ దిశగా అడుగులు వేస్తున్నాం.

- ఎమ్మెల్యే పరిటాల సునీత

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

అనంతపురం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలిసెట్-2025 కౌన్సెలింగ్ ముగిసింది. అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ సాగింది. చివరి రోజు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 336మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజు వరకు 2712మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఎవరైనా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోకపోతే వారు ఆప్షన్ ఎంట్రీ తేదీల్లో హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. ఆప్షన్ల ప్రక్రియ తేదీ త్వరలోనే వెలువడుతుందన్నారు.

బతుకుపై భరోసా..

కుట్టు శిక్షణకు విశేష స్పందన

మహిళల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం

ఒక యేడు అతివృష్టి, మరో యేడు అనావృష్టి.. పంటలు వేసిందే తప్ప.. చేతికొచ్చింది లేదు. లాభాలు చూసిందీ లేదు. నష్టాలే రాబడి.. అప్పులే మిగులుబడి.. ఇల్లు గడవాలన్నా కష్టమే.. పిల్లల చదువులు, పెళ్లిళ్లు తలచుకుంటే భయమేసేది.. బతుకే బెంగ.. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణకు మహిళలు ఆసక్తి చూపారు.. ఇలాగైనా బతికే మార్గం దొరుకుతుందేమోననుకున్నారు.. శిక్షణ పూర్తి దశకు చేరుకున్నాక.. వారికి ఎనలేని ధైర్యం వచ్చింది. కుట్టు మిషన్‌తో బతికేయగలమన్న నమ్మకం పెరిగింది.. కుట్టుశిక్షణ బతుకుపై భయాన్ని పోగొట్టి.. ఆత్మవిశ్వాసం నింపిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

పెనుకొండ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణ వారిలో బతుకుపై భరోసా కల్పిస్తోంది. మహిళలకు సమాజంలో సరైన అవకాశం లేకపోవడం, చదువున్నా ఉద్యోగం లేకపోవడం, కుటుంబ బాధ్యతలు వంటి కారణాలతో ఇంటికే పరిమితం అవుతున్నారు. అటువంటి వారికి ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తోంది. పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తోపాటు కుట్టుమిషన్ ఉచితంగా అందజేయనుంది. కుట్టుశిక్షణకు మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. శిక్షణ పూర్తి చేసుకుని ఇంటి వద్దే జీవనోపాధి పొందుతామని మహిళలు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 18 వేల మంది మహిళలు ఉచితంగా కుట్టుశిక్షణ పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో 80 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. 90 రోజుల ఈ శిక్షణ ముగింపు దశకు చేరుకుంది. దీంతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గ్రామంలో కుట్టుమిషన్ ఏర్పాటు చేసుకుని, ఉపాధి పొందగలమంటున్నారు. తద్వారా కుటుంబ ఖర్చులు భరించగలమని సంతోష పడుతున్నారు.

ధైర్యం వచ్చింది..



ఉచిత కుట్టు శిక్షణతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. చాలీచాలని ఆదాయంతో ఇబ్బందులు ఉంటాయి. కూటమి ప్రభుత్వం కుట్టు మిషన్‌పై శిక్షణ ఇవ్వడంతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం సంతోషంగా ఉంది. శిక్షణతో సొంతకాళ్లపై నిలబడగలమన్న ధైర్యం వచ్చింది.

- నాజియా, దర్గాపేట, పెనుకొండ





కుట్టుమిషన్‌పై మంత్రి సవిత (ఫైల్), పెనుకొండలో శిక్షణ పొందుతున్న మహిళలు

ఇంటి బాధ్యతలో నా వంతుగా..



ఇంటి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇవి భారమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకోవడం ఎంతో ఉపశమనం. గ్రామంలో టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటా. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇంటి ఖర్చులు, అభివృద్ధికి వినియోగిస్తా.

- అరుణ, వెంకటరెడ్డిపల్లి, పెనుకొండ మండలం

విశేష స్పందన



కూటమి ప్రభుత్వంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు నాయుడు ఈ ఏడాది మార్చిలో ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 15న శిక్షణ కేంద్రాలను ప్రారంభించాం. పెద్దఎత్తున మహిళలు వచ్చారు. జూలై మొదటి వారానికి శిక్షణ పూర్తవుతుంది. పూర్తి చేసుకున్న ప్రతి మహిళకు ఉచిత కుట్టుమిషన్‌తోపాటు సర్టిఫికెట్ అందిస్తాం. కుట్టుశిక్షణతోనే ఆగిపోకుండా కంప్యూటర్ డిజైన్ తదితర వాటిపై నైపుణ్యం సాధించి, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి. వాటన్నింటికీ ప్రభుత్వం అండగా ఉండి రుణాలు అందిస్తుంది.

- సవిత, బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి

గుత్తి మీదుగా తిరుపతికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాందేడ్-తిరేపతి మధ్య (వయా గుత్తి) వచ్చే నెలలో ఓ వీక్లీ ఎక్స్‌ప్రెస్ నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. నాందేడ్-తిరుపతి ప్రత్యేక రైలు (నం 07015) జూలై 5 నుంచి 26వ తేదీ వరకూ నాందేడ్‌లో ప్రతి శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.10 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07016) జూలై 6 నుంచి 27వ తేదీ వరకూ ప్రతి ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.15 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైలు ముడ్ ఖేడ్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

టమోటా మార్కెట్ ప్రారంభం

- మండీలకు వస్తున్న కాయలు
- పది, పదిహేను రోజుల్లో పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం

అనంతపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్ ప్రారంభమైంది. ఇటీవల మార్కెట్‌లోని మండీల యజమానులు మంచి రోజులు చూసుకుని మండీలను ప్రారంభించుకున్నారు. టమోటా సీజన్ ప్రారంభం అవుతుండటంతో ఆ మేరకు మండీల యజమానులు మండీలను అన్నివిధాలా సిద్ధం చేసుకుంటున్నారు. కాయల ఎగుమతి, దిగుమతులకు క్రేట్‌లు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని మండీల నిర్వాహకులు వ్యాపార లావాదేవీలు ప్రారంభించేశారు. వివిధ ప్రాంతాల నుంచి చిన్న.. చిన్న కాయలు మార్కెట్‌కు వస్తుండటంతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో 30కిపైగా మండీలు ఉన్నాయి. సగం మండీల్లో కాయలు కొనుగోలు చేస్తున్నారు. ఆయా మండీలకు 15వేల బాక్సులకుపైగానే కాయలు వస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. మరో పది, పదిహేను రోజుల్లో కాయల రాక మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరుపై అనంత జట్టు విజయం

అండర్-19 మల్టీడే క్రికెట్ పోటీల్లో సెంచరీల మోత


జయంత్ కృష్ణ


వీరారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంత బ్యాటర్లు సెంచరీల మోత మోగించడంతో నెల్లూరుపై అనంతపురం జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మల్టీడే క్రికెట్ పోటీలు కడపలో నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 50.4ఓవర్లలో 212 పరుగులకే ఆలౌట్ అయ్యింది. తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 77ఓవర్లలో 524 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా బ్యాటర్లు జయంత్‌కృష్ణ 221, వీరారెడ్డి 157 పరుగులు సాధించారు. రెండో ఇన్నింగ్స్‌లో నెల్లూరు 99.2 ఓవర్లలో 405పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ కారుణ్య ప్రసాద్ 135, సాహుల్ హమీద్ 89పరుగులు చేశారు. 94పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అనంత రెండో ఇన్నింగ్స్‌లో 24.3ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ప్రాబబుల్స్‌కు ఇద్దరు మహిళా క్రికెటర్లు


చక్రిక, హిమవర్షిణిని అభినందిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అండర్-19 రాష్ట్ర మహిళా జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన చక్రిక, హిమవర్షిణి చోటు దక్కించుకున్నారు. వీరు తపోవనం క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. జూలై రెండు నుంచి జరిగే పోటీల్లో పాల్గొనే ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని తపోవనం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మనోజ్, మదన్‌మోహన్ రెడ్డి, రాయల్‌మురళి అభినందించారు.

మెగా పేరెంట్స్ మీటింగ్ వాయిదా

అనంతపురం విద్య, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో జూలై 5న నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్ తాత్కాలికంగా వాయిదా పడింది. ఇప్పటికే ఈ మీటింగ్ నిర్వహణకు శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్న విషయం విదితమే. కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరవుతారని అక్కడ అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. జూలై 5న మొహరం పండుగ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మెగా పేరెంట్స్ మీటింగ్‌కు హాజరుకావడం కష్టమని రాయలసీమ ప్రాంత టీచర్ల సంఘాలు, అధికార పార్టీ నాయకులు విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఇదే విషయాన్ని విద్యాశాఖ, ఎస్ఎస్ఏశాఖల అధికారులకు రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేశారు. విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ వెల్లడించారు. అయితే ఈమీటింగ్ జూలై 9లేదా పదో తేదీన ఉండొచ్చనే అభిప్రాయాలు విద్యాశాఖ వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి.

చీనీ టన్ను రూ.27వేలు

అనంతపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27,690 అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.13వేలు, సరాసరి రూ.18వేలు విక్రయాలు జరిగాయన్నారు. సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 20వేలు, కనిష్ఠం రూ.3వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 966 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.

సార్.. అన్యాయం చేయొద్దు..!

(5వ పేజీ తరువాయి)

నిలదీశారు. ముగ్గురు వ్యక్తులతో లావాదేవీలు నిర్వహిస్తూ, వారు చెప్పిన వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని బయట ప్రచారం జరుగుతోందన్నారు. క్రమబద్ధీకరణలో స్థానాలు కోల్పోయిన సిబ్బందికి సమీపంలోనే పోస్టింగ్ ఇవ్వాలన్నారు. ఐదేళ్లు పూర్తయిన వారి జాబితాతోపాటు ఖాళీల వివరాలు ప్రదర్శించి, సిబ్బందికి ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రిక్వెస్ట్ బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. సంఘం నాయకుల వాదనలకు జేడీ స్పందిస్తూ.. తనపై ఆరోపణలు చేయడం సరికాదని, అవసరమైతే ఏసీబీకి ఫిర్యాదు చేస్తానన్నారు. దీంతో తాము తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనని సంఘం నాయకులు స్పష్టం చేశారు. దాదాపు గంటకుపైగా జేడీ, సంఘం నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు ఐదేళ్లు పూర్తయిన పోస్టులతోపాటు ఖాళీ పోస్టుల వివరాలను ప్రదర్శించి, పారదర్శకంగా బదిలీలు చేపడతామని జేడీ హామీ ఇవ్వడంతో సంఘం నాయకులు శాంతించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షు డు శివ, ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ రజాక్, ఉపాధ్యక్షులు చైతన్య, జగదీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జేడీ ఆధ్వర్యంలో బదిలీలు చేస్తే అన్యాయమే

ఈనెలాఖరులో ఉద్యోగ విమరణ పొందనున్న పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ఆధ్వర్యంలో బదిలీలు జరిగితే తమకు అన్యాయం జరుగుతుందని పశుసంవర్ధక సహాయకుల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ ఇతర సంఘం నాయకులు కలెక్టర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. బదిలీల సమస్యలపై జేడీ వెంకటస్వామికి వినతి పత్రం అందజేయగా 'ఖాళీ పోస్టులు చూపించను. నాకు నచ్చిన వ్యక్తిని, నచ్చిన చోటుకు బదిలి చేస్తా. కౌన్సెలింగ్ కూడా పెట్టను' అంటూ తమను కార్యాలయం నుంచి బయటకు పంపించారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

బదిలీల్లో గందరగోళం..!

తొలుత సీనియార్టీ జాబితా మేరకు...
మధ్యాహ్నం నుంచి ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్
గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో సిఫార్సులు
లేఖలు జతచేయని వారికి అన్యాయం


గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, జూన్28(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ గందరగోళ ంగా మారింది. అనంతపురం వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. తొలుత స్పౌజ్, వికలాంగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత మిగతా సిబ్బందికి కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియార్టీ జాబితా మేరకు చాంబర్‌లోకి పిలిచారు. సీనియార్టీ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించడంపై సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గంటపాటు కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తిరిగి మధ్యా హ్నం నుంచి ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంత జిల్లాలో 126 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరిలో అనంత జిల్లాలో 101 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 102 మంది సిబ్బందికి ఐదేళ్ల కాలం పూర్తయింది. మిగిలిన సిబ్బంది రిక్వెస్ట్ కింద బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జేడీ కార్యాలయం సిబ్బందితో కిక్కిరిసింది. రాత్రి 9.40 దాకా బదిలీల కౌన్సెలింగ్ కొనసాగింది.

సిఫార్సులకు పెద్దపీట

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేశారు. సిఫార్సు లేఖలు జత చేయని సిబ్బందికి అన్యాయం జరిగింది. మండల, డివిజన్ స్థాయి అధికారులు తమకు అనుకూలమైన స్థానం కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పెట్టడం సాధారణం. అందుకు విరుద్ధంగా రైతు సేవా కేంద్రంలో పనిచేసే సిబ్బంది బదిలీల కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖలు ఇవ్వడం గమనార్హం.

నేడు కౌన్సెలింగ్‌కు రండి

- ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఉద్యాన సహాయకులకు ఆదివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురం ఉద్యాన డీడీ కార్యాల యంలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన 280 మందితోపాటు రిక్వెస్ట్ బదిలీ కోసం 43 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సిబ్బంది ఆప్షన్ ఫాంతోపాటు తగిన పత్రాలు తీసుకురావాలన్నారు. మెరిట్ సీనియార్టీ మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆవె వెల్లడించారు.

వార్డు సెక్రటరీల బదిలీలు పూర్తి


సచివాలయ సంక్షేమ కార్యదర్శుల బదిలీల్లో గందరగోళం తలెత్తడంతో సర్దిచెబుతున్న కదిరి మున్సిపల్ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): స్వల్ప ఉద్రిక్తతల నడుమ మున్సిపాలిటీల పరిధిలోని వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలు పూర్తి చేశారు. మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ జోక్యంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని 12మున్సిపాలిటీల సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సజావుగా నిర్వహించినట్లు కన్వీనర్, అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. జీసెస్‌నగర్‌లోని జయమణెమ్మ కళ్యాణమండపంలో ఉదయం వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించి, 262మందిని బదిలీ చేశారు. మధ్యాహ్నం వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు జరిగిన కౌన్సెలింగ్‌లో 235మందికి స్థానచలనం కలిగించారు. తపోవనం సర్కిల్‌లో ఉన్న పుష్ప ఫంక్షన్‌హాల్‌లో ఉదయం వార్డు శానిటేషన్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ చేపట్టగా 227మందిని, మధ్యాహ్నం వార్డు అమెనిటీస్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించగా 121మందిని బదిలీ చేశారు. అనంత నగరపాలక సంస్థ నూతన కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉదయం వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్‌ను ఏర్పాటు చేయగా 120మందిని బదిలీ చేశారు. అయితే శుక్రవారం అడ్మిన్ సెక్రటరీలకు జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మున్సిపల్ ఆర్డీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో చర్చించి ఆ బదిలీ ప్రక్రియను రద్దు చేయించారు. తిరిగి శనివారం సాయంత్రం నిర్వహించారు. దీంతో అడ్మిన్ సెక్రటరీలు 156మందిని బదిలీ చేశారు. జయమణెమ్మ కళ్యాణమండపంలో జరిగిన ఎడ్యుకేషన్ సెక్రటరీల స్పౌజ్ బదిలీ విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. ఎట్టకేలకు 12 మున్సిపాలిటీలలోని వార్డు సచివాలయాల ఉద్యోగులు మొత్తం 1121మందిని బదిలీ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు.

అధికారుల అనాలోచిత నిర్ణయం

బదిలీల కౌన్సెలింగ్‌కు ఇద్దరికి ఆహ్వానం
ఒకరికే పూర్తి.. మరొకరికి వాయిదా..


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓలు నాగరాజ నాయుడు, సమత

అనంతపురం న్యూటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటలకే కౌన్సెలింగ్‌కు తరలి వచ్చారు. దీంతో జిల్లా పరిషత్ ఆవరణం నిండిపోయింది. అధికారులు తీరిగ్గా 11 గంటలకు గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభించారు. అనంత, శ్రీసత్యసాయి డీపీఓలు నాగరాజనాయుడు, సమత, డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, ఏఓ నాగరాజు కౌన్సెలింగ్ చేపట్టారు. స్పౌస్ కేటగిరీ వారితో మొదలు పెట్టారు. మధ్యాహ్నం వరకు వారిదే సాగింది. ఒకేరోజు పూర్తికావడం కష్టమని భావించిన అధికారులు.. ఆప్షన్లు ఇచ్చేసి వెళ్లిపోవాలని సూచించారు. కౌన్సెలింగ్ నిర్వహించి వెంటనే బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలని కొందరు నిరసనకు దిగారు. దీంతో గ్రేడ్-5 కార్యదర్శుల కౌన్సెలింగ్ ఆదివారానికి వాయిదా వేశారు. గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లకు ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ చేపట్టారు. రాత్రి పొద్దుపోయేదాకా ప్రక్రియ సాగింది. బదిలీ ఉత్తర్వులు వెలువడితేగానీ, పారదర్శకంగా చేశారా అన్నది తెలియని పరిస్థితి.

జాతీయ జట్టుకు ఆడాలి

ఏసీఏ కామెంటేటరీల సంఘం చైర్మన్ కళ్యాణకృష్ణ
మల్టీ డే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంతలో ఉండే వసతులు, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జాతీయ జట్టుకు ఆడే స్థాయికి చేరాలని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)కామెంటేటరీల సంఘం చైర్మన్ కళ్యాణకృష్ణ ఆకాంక్షించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మల్టీడే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను శనివారం అనంతపురంలోని అనంత క్రికెట్ మైదానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి కళ్యాణకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలిపోటీ అనంతపురం, కడప జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప తొలి ఇన్నింగ్స్‌లో 76.5ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ వంశీకృష్ణ 86పరుగులు, జహీర్ అబ్బాస్ 85, జయవర్ధన్ 40 పరుగులు చేశారు. అనంత బౌలరు కమిల్ 3వికెట్లు పటగొట్టాడు. అనంతరం బరిలోకి దిగిన అనంత మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆరు ఓవర్లలో వికెట్ నష్టానికి 47పరుగులు చేసింది. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5ఓవర్లలో 250పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు సంజయ్‌నాయుడు 84పరుగులు, అశోక్‌కుమార్ 76 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ మాధవ్‌నాయుడు 3వికెట్లు, మల్లేషన్, ధరణికుమార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు 12ఓవర్లలో 49 పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పారా క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పారా క్రీడలు ఆడే దివ్యాంగులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పారా స్పోర్ట్స్ చైతన్యయాత్ర శనివారం జిల్లాకు చేరింది. స్థానిక అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో డీఎస్‌డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీతో పారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 3శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు క్రీడాకారులు రుణపడి ఉంటారన్నారు. పారా ఒలింపిక్స్, పారా ఆసియన్ గేమ్స్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పారా క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నగదు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ చైర్మన్ రవికాంత్ రమణ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, నెల్లూరు మాల్యాద్రి నాయుడు, గుంటూరు శ్రీనివాసగౌడ్, అథ్లెటిక్ కోచ్ మంజుల, వెంకట్, సుభాషిణి, వేణుగోపాల్, మల్లికార్జున, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్

రిక్వెస్టులలో వాస్తవమెంత?

(5వ పేజీ తరువాయి)

తన్నుకుపోయారు. దీంతో అధికారులతో యూనియన్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఒకరోజు గడువిస్తే.. రిక్వెస్టులలో వాస్తవాలు తేలుస్తామంటూ వాదనకు దిగారు. దీంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అంతలోనే ఎస్ఈ జహీర్ అస్లాంకి కలెక్టర్ నుంచి ఫోన్ వచ్చిందంటూ వెళ్లిపోయారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా వారి కౌన్సెలింగ్ చేపట్టారు. తొలుత అనంతపురం జిల్లా పూర్తి చేయాలని వాదనకు దిగడంతో బదిలీల ప్రక్రియను వాయిదా వేశారు. దీనిపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు.

యూనియన్ నాయకుల ఓవరాక్షన్

శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేసే కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకుల పేరుతో హల్‌చల్ చేశారు. అధికారులను సైతం కౌన్సెలింగ్ నిర్వహించే ప్రాంతానికి వెళ్లనీయకుండా వాదనలకు దిగారు. వారి తీరు విమర్శలకు తావిస్తోంది.

వక్ఫ్ భూముల వేలం

దర్గాహొన్నూరు భూములకు రూ.4.2 లక్షల ఆదాయం


వక్ఫ్‌బోర్డు భూములకు వేలం నిర్వహిస్తున్న రామసుబ్బారెడ్డి

అనంతపురం విద్య, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు భూముల ను కౌలుకు చేయడానికి రైతులు పోటీ పడ్డారు. వక్ఫ్ భూములకు కౌలు వేలం జిల్లా మైనార్టీ కార్యాలయంలో మైనార్టీశాఖ జిల్లా అధికారి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూర్ దర్గాకు చెందిన 25.50ఎకరాల భూముల సాగుకు ఆప్రాంత రైతులు పోటీగా తరలివచ్చారు. అంతకుముందు రామసుబ్బారెడ్డి, రెవెన్యూశాఖ తరఫున గోవిందవాడ వీఆర్ఓ సుజాతారామ్ నిబంధనలను వివరించారు. వేలంలో దక్కించుకున్న వారు మూడేళ్ల పాటు భూములు సాగుచేసుకోవచ్చని, ప్రతి ఏటా పాడిన పాటకు అదనంగా 6శాతం డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆతర్వాత వేలం మొదలు పెట్టగా, తలారి పోతులింత అనే రైతు రూ.4.20 లక్షలకు గోవిందవాడ దర్గా భూములను దక్కించుకున్నాడు. గుంతకల్లు హాజీదర్గాకు చెందిన 38ఎకరాల భూములను వేలం పాడటానికి రైతులు నిరాసక్తి చూపారు. ఆభూములలో చెట్లు ఎక్కువగా ఉన్నాయని, పంటపెట్టినా దిగుబడి రాదని ఎకరా రూ.30వేలకు ఇవ్వాలని కోరారు. జిల్లా మైనార్టీ అధికారి మాత్రం ఎకరా రూ.50వేలు చెప్పగా పాట పాడటానికి రైతులు ముందుకు రాలేదు. దీంతో గుంతకల్లు దర్గాభూముల వేలం వాయిదా వేశారు. గతంలో గోవిందవాడ దర్గా భూములకు రూ.2లక్షలు ఆదాయం వచ్చింది. ఈసారి రూ.4.20లక్షలకు పెరిగినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు.

ప్రధాన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలో దళిత బాలికపై అత్యాచారం కేసులో ప్రధా న నిందితుడు ప్రతీష్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం సా యంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ఇటీవల వెలుగుచూసిన బాలికపై అత్యాచారం కేసులో 14 మందితోపాటు ఇద్దరు పెద్ద మనుషులపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే 15 మందిని రిమాండ్‌కు పంపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు తూమప్పగారి ప్రతీష్‌ను రామగిరి మండలం చెన్నంపల్లి క్రాస్ వద్ద శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పుట్టపర్తి కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి జూలై 7వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

నార్పల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు బావిలో పడి రాజశేఖర్(53) మృతిచెందాడు. గ్రామానికి చెందిన రాజశేఖర్ ఆలయ సమీపంలో ఉన్న బావి దగ్గరకు నీళ్ల తాగడానికి వెళ్లాడు. బావిలో దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడ్డాడు. అతడికి ఈత రాకపోవడంతో బావిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఖాశీం స్వామి ఉత్సవాలు ప్రారంభం



బత్తలపల్లి, జూన్28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం ఖాశీం స్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా అనంతలో గూగూడు కుళ్లాయిస్వామి తరువాత అంతటి స్థాయిలో బత్తలపల్లి ఖాశీం స్వామి ఉత్సవాలు జరుగుతాయి. మొదటి రోజు శనివారం పీర్ల మకాన్‌లో ఖాశీం స్వామి ఆశీనులయ్యారు. జూలై 4న చిన్న సరిగెత్తు, 5న కాసీంస్వామి గ్రామాల పర్యటన, 6న పెద్ద సరిగెత్తు, 7న వివిధ గ్రామాల పీర్లతో ఖాశీం స్వామి భేటీ, అదేరోజు సాయంత్రం జలధి, 9న సామివారి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

న్యూస్ బాక్స్

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


గుండం, పీర్లచావిడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కనగానపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన దస్తగిరి, వన్నూరుస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం ఉత్సవాలను హిందూముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునేది పీర్ల పండుగ ఒకటే. అటువంటి పండుగను గూగూడులో జరిగే మొహర్రం పండుగలాగే ఇక్కడ కూడా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జూలై 1న గంధపూజ, పెట్టెమెరమన, 2న పీర్లస్వాములు చావిడిలో కొలువుదీరడం, 6న పెద్దసెరగెత్తు, 7న సోమవారం పీర్లు జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.

ఘనంగా తాతయ్యస్వామి ఆరాధన

శింగనమల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్లగొంది గ్రామంలో తాతయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామ శివార్లలో వెలిసిన తాతయ్యస్వామి ఆలయంలో రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం రాత్రి వర్షం కోసం భజనలు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆలయంలో శాశ్వత అన్నదానం

ఆత్మకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు కొండపై ఉన్న మలహోబుల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతి శనివారం శశ్వాత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో శనివారం ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన మోహన్, ఆయన సతీమణి ప్రవీణ ఆర్థిక సహకారంతో అన్నదానం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఆలయ పూజారులు అన్నారు. దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దేవదాస్, బీసీ సెల్ నాయకులు రాజారమేష్, భక్తులు పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. విజిలెన్స్, రెవెన్యూ అధికారులు శనివారం నగరంలోని 44వ జాతీయ రహదారి సోములదొడ్డి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఏపీటీ 39 టీపీ7597 నంబర్ ఐచర్ వాహనంలో కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తుండటంతో గుర్తించారు. 200 బ్యాగుల పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్నట్టు తేల్చిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో అప్పజెప్పారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన డ్రైవర్ శంకర్, ఆలూరు మండలానికి చెందిన హెల్పర్ చిన్న, ఆదోనికి చెందిన వాహన యజమాని రాజశేఖర్ అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి క్రిమినల్ కేసు నమోదుచేశారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఏఈఈ రవీంద్రనాథ్, సీఎస్‌డీటీ మహబూబ్‌భాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోహన్ ట్రేడర్స్ యజమానికి పరామర్శ


మోహన్‌ట్రేడర్స్ షాపును పరిశీలిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ఎరువుల డీలర్లసంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన మోహన్‌ట్రేడర్స్ యజమాని మోహన్‌రెడ్డిని ఉమ్మడి అనంత జిల్లా ఎరువుల డీలర్ల సంఘం నాయకులు పరామర్శించారు. శనివారం సాయంత్రం బత్తలపల్లి మండల కేంద్రంలో అగ్నిప్రమాదానికి గురైన షాపును డీలర్ల సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రంగయ్య పరిశీలించారు. అగ్నిప్రమాదంలో రూ.4 కోట్లు నష్టంపోవడం బాధాకరమన్నారు. యునియన్‌బ్యాంకు అధికారులు న్యాయం చేయాలనికోరారు.

పనిభారం తగ్గించండి

పంచాయతీ కార్యదర్శుల నిరసన

అనంతపురం న్యూటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి) పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ముందు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు జడ్పీ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్నారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని, శానిటేషన్ మెరుగుకు అనుగుణంగా సిబ్బందిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జడ్పీ కార్యాలయంలో డీపీఓ నాగరాజనాయుడును యూనియన్ నాయకులు కలిశారు. తమ సమస్యలను చెప్పుకున్నారు. స్పందించిన ఆయన కార్యదర్శులే పంచాయతీలకు లీడర్లు అని, మీరు మండల, జిల్లా కేంద్రాల్లో ఎప్పుడైతే ఉండకుండా స్థానికంగా ఉంటారో అందుకు అనుగుణంగా మీకు గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శంకర్, నాగరాజు, శివమూర్తి, మురళీ, రవికుమార్, భీమేష్, వేణుగోపాల్‌రెడ్డి, కొల్లప్ప, మహేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

అభివృద్ధికి నోచుకోని చిన్నమట్లగొంది..!

ఆంధ్రజ్యోతి విజిట్

- దశాబ్దాలుగా రహదారి లేదు
- ఆర్టీసీ బస్సు ఎరుగని గ్రామం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

శింగనమల, జూన్28(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిన్నమట్లగొంది గ్రామం నోచుకోవడం లేదు. ఏళ్లు గడిచినా గ్రామానికి సరైన రహదారి లేదు. మట్టిరోడ్డులోనే గ్రామస్థులు ప్రయాణం సాగిస్తున్నారు. గ్రామంలోని కాలనీల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. గ్రామ ప్రజలు ఆర్టీసీ బస్సును చూసింది లేదు. శింగనమల మండలంలోని పెద్దమట్లగొంది పంచాయతీ హ్యాబిటేషన్ గ్రామం చిన్న మట్లగొంది. గ్రామంలో 240 ఇళ్లు 3 వేల జనాభా ఉంది. కుటుంబాలన్నీ వ్యవసాయం, వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఏళ్లు గడిచినా గ్రామంలో సీసీ రోడ్లు లేవు. సర్పంచుకు వచ్చే నిధులు పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనకే సరిపోవడం లేదు. నిధుల కొరతతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఈ ఐదేళ్లలో సీసీ రోడ్డు వేసిన దాఖలాలు లేవు. గ్రామానికి మూడు


చిన్నమట్లగొంది గ్రామంలో సీసీ రోడ్డు లేని కాలనీ


చిన్నమట్లగొంది నుంచి పెద్ద మట్లగొందికి వెళ్లే రోడ్డు పరిస్థితి

వైపులా ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రావాలన్నా, ఎక్కడైనా పోవాలన్నా సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు తెస్తా



వైసీపీ పాలనలో పంచాయతీ అభివృద్ధికి పైసా నిధులు రాలేదు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు సొంత నిధులు ఖర్చు చేశా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీసీ రోడ్లకు రూ.10 లక్షలతోపాటు, లింక్ రోడ్లకు బీటీ రోడ్డు ఏర్పాటుకు, గ్రామంలో 5 కి.మీ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కెటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇప్పటికే పనుల కోసం ప్రతిపాదనలు పంపాం.

-పార్నపల్లి రమేష్, సర్పంచ్

ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి: లక్ష్మి



గ్రామానికి వచ్చి 10 ఏళ్లయ్యింది. అప్పటి నుంచి గ్రామంలో ఎటు చూసినా మురుగునీరే దర్శనమిస్తుంది. సీసీ రోడ్డు వేసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వ వచ్చిన తరువాత గుడి వద్ద రూ.5లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేసింది. అయితే అక్కడ అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

పాలకులు దృష్టి సారించాలి: ఆదినారాయణ



గ్రామంలో కనీసం సీసీరోడ్లు సక్రమంగా లేవు. ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే అర కిలోమీరు నడుచుకుంటూ వెళ్లాలి. చిన్నతనం నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని పాలకులను వేడుకుంటూనే ఉన్నాం. అయినా ఏ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వమైన గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

రీకాలింగ్ అంటూ వైసీపీ కొత్త నాటకాలు

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రికాలింగ్ పేరుతో వైసీపీ కొత్త నాటకాలకు తెరలేపిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శనివారం ప్రకటనలో మండిపడ్డారు. ప్రజలకు ఎవర్ని రీకాల్ చేయాలో బాగా తెలుసన్నారు. అందుకే గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారంటూ చురకలంటించారు. వైసీపీ నేతలు చేపట్టిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై అనంతపురం ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ఐదు సంతకాలు చేసి, కీలకమైన హామీలు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటివి ఎన్నో తీసుకురావడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతోందన్నారు. వైసీపీ నాయకులు దీన్ని తట్టుకోలేక రీకాలింగ్ అంటూ కొత్త డ్రామాకు తెరతీశారంటూ మండిపడ్డారు. ఒక వైపు పరామర్శల పేరుతో వైసీపీ కార్యకర్తలను జగన్ బలి తీసుకుంటున్నారని, ఇంకో వైపు గత ఐదేళ్లు చేసిన తప్పులకు జైలు బాట పడుతున్నారంటూ దగ్గుపాటి విమర్శలు గుప్పించారు. దీంతో ప్రజల్లో రోజురోజుకీ చులకన అవుతామన్న భావనతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలని చూస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాటాకు చప్పుళ్లకు భయపడం

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల: వైసీపీ తాటాకు కూటమి ప్రభుత్వం భయపడదు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఒక ప్రకటనలో అన్నారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు బలప్రదర్శన మాదిరిగాపెట్టి సైసై అని రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మెదటి రోజునే పించన్ల పెంపునకు శ్రీకారం చూట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ రెచ్చగొట్టే కార్యాక్రమాలు చేస్తూ పబ్బం గడుపుతోందన్నారు.

ఖాళీలు ఉన్నచోటే దరఖాస్తుల స్వీకరణ

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం వైద్యం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల ఖాళీల భర్తీ నోటిఫికేషన్‌లో పొరపాట్ల దిద్దుబాటుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఖాళీలు 58 ఉండగా, 57 స్థానాలనే నోటిఫికేషన్‌లో చూపించారు. ఆశావహులు దరఖాస్తులను ఎక్కడ ఇవ్వాల్లో స్పష్టత ఇవ్వలేదు. దీంతో అనేకమంది నిరుద్యోగ మహిళలు దరఖాస్తులు తీసుకుని డీఎంహెచ్ఓ కార్యాలయానికి వస్తున్నారు. ఈ సమస్యపై 'నిరుద్యోగ మహిళలతో ఆటలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో డీఎహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి స్పందించారు. ఖాళీలు ఉన్న ప్రాంతాలలో సచివాలయ ఏఎన్ఎం, ఆరోగ్య కేంద్ర అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. ఖాళీలు లేని ప్రాంతాల్లో దరఖాస్తులు స్వీకరించడం లేదని తెలిపారు. కుందుర్పి మండలం మలయనూరులో రెండు పోస్టులకు గాను ఒకటి మాత్రమే నోటిఫికేషన్‌లో చూపించారని, రెండు ఖాళీలకు దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం: ఎంపీడీఓ

అనంతపురం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవయుగ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి నగర శివారులోని నవయుగ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులు సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ కాలనీలోని సమస్యలపై ఇప్పటికే తనకు ఫిర్యాదులు అందాయని, సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అందుకోమ్మా.. తల్లికి వందనం..!


నాగమునెమ్మకు నగదు అందజేస్తున్న మసూద్

శింగనమల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం సొమ్ము పొరపాటున తమ ఖాతాలో జమ కావడంతో కొండూరు మాసూద్ అనే వ్యక్తి బాధ్యతగా లబ్ధిదారుకు అందజేశారు. శింగనమల జడ్పీ ఉన్నత పాఠశాలలో కొండూరు మాసుద్, సావిత్రి దంపతుల కూతురు కొండూరు చంద్రకళ 9వ తరగతి చదువుతోంది. తోపుదుర్తి నాగమునెమ్మ, చంద్రాయుడు దంపతుల కూతురు తోపుదుర్తి చంద్రకళ కళ కూడా 9వ తరగతి చదువుతోంది. విద్యార్థినుల పేర్లు, తరగతి ఒకటే కావడంతో పొరపాటున నాగమునెమ్మ ఖాతాలో జమకావాల్సిన తల్లికి వందనం సొమ్ము రూ.13 వేలు సావిత్రి పోస్టల్ ఖాతాలో జమ అయింది. అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న కొండూరు మాసూద్, తన భార్య ఖాతాలో అదనంగా జమ అయిన సొమ్మును నాగమునెమ్మకు శనివారం గ్రామ సచివాలయంలో అందజేశాడు. వీఆర్ఓ ఎర్రితాతాయ్య, మహిళా పోలీసు శిల్ప తదితరులు మసూద్‌ను అభినందించారు.

పెచ్చులూడి పడితే.. అంతే..!

- సర్వజన వైద్యశాల నిర్వహణ అధ్వానం
- పెచ్చులూడుతున్నా పట్టని అధికారులు
- ఆందోళన చెందుతున్న రోగులు

అనంతపురం వైద్యం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏదైనా జబ్బు, వ్యాధిని నయం చేసుకునేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తారు. ఆసుపత్రిలోనే ప్రమాదానికి గురైతే ఏంటి పరిస్థితి?. ఇదే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు ఆసుపత్రికి వచ్చేవారు. ఆసుపతిలోని ఓపి నెంబర్ 8లో జనరల్ సర్జరీ వైద్యసేవలందిస్తున్నారు. ప్రమాదాల్లో గాయాలపాలైన వారికి, శరీరంలో వేడి గుల్లలు, పుండ్లు, గడ్డలున్న వారికి, కాలిన గాయాలతో వాచ్చేవారికి, కడుపు నొప్పి తదితర బాధలతో వచ్చేవా


పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన స్లాబు


ఓపీలో కూర్చున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు

రికి ఓపీ 8లో వైద్య చికిత్సలు అందిస్తారు. ఓపీకి వచ్చేవారికోసం కూర్చోవడానికి బండలతో బెంచీలను ఏర్పాటుచేశారు. అయితే ఓపీ వరండాపై నున్న స్లాబు పెచ్చులూడి పోయింది. పైనుంచి నీరుకారుతూ కింద బండలు తేమగా మారుతున్నాయి. ఓపీకి వచ్చేవారికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో వరండాలోనే కూర్చుకుంటున్నారు. ఈక్రమంలో పెచ్చులూడి ప్రమాదానికి గురయ్యే అవకశాముంది. పర్యవేక్షించే అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండంతో ఎప్పుడైనా ప్రమాదానికి గురికావాల్సి వస్తోందని రోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భవన నిర్మాణం, మరమ్మతులు పర్యవేక్షించే ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు ఇటువైపు వస్తేనే కదా? తెలిసేదని ప్రశ్నిస్తున్నారు.

రూ.1.25 కోట్లతో జూనియర్ కళాశాల నిర్మాణం

- భూమిపూజ చేసిన టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామంలో రూ.1.25కోట్లతో కేజీబీవీ జూనియర్ కళాశాల నిర్మించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ తెలిపారు. శనివారం పాత కురుగుంటలోని కేజీబీవీ పాఠశాల ఆవారణలో కళాశాల భవన నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, పాముురాయి వెంకటేష్, నారాయణస్వామి, రాగేమురళి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతోనే గ్రామంలో కళాశాల సాధ్యమైందన్నారు. మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, వెంకటరాముడు, విజయ్‌కుమార్, ధర్మేంద్ర, జాఫర్, వెంకటేష్, జయరాములు, దండోరా రమణ, అక్కులప్ప, డీలర్లు రంగయాదవ్, పరమేష్, సాయి, అక్కులప్ప, రామాంజనేయులు, బాబావలి, మస్తాన్, అంజన్‌రెడ్డి, పూజరప్ప, చిరంజీవి పాల్గొన్నారు.


కళాశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు


విద్యుత్ శాఖ ఎస్ఈతో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

సూర్యఘర్ యోజనతో విద్యుత్ బిల్లు ఆదా...!

- ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనతో విద్యుత్ చార్జీల బిల్లులు ఆదా అవుతాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాప్తాడు ప్రజలకు సూచించారు. శనివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, ఇతర అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించి, స్కీం తీసుకునేలా చైతన్యం తేవాలన్నారు. వెంటనే సోలార్ ప్యానళ్లు అమర్చుకోడానికి అనువుగా ఉండే ఇళ్ల పైకప్పులు గుర్తించాలన్నారు. స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ భవనాలపై ఏర్పాటుచేసుకునేలా ఆయా వర్గాల ప్రజలు, అధికారులతో మాట్లాడాలని సూచించారు. 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం ఉన్న సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. నెలకు 120 యూనిట్ల విద్యుత్‌ను వాడితే రూ.1000 బిల్లు వస్తుందని అదే సోలార్ ఉంటే రూ.338 ఖర్చు తగ్గుతుందన్నారు. ఇందులో ఎన్నో రాయితీలు, సదుపాయాలున్నాయన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు


ధర్నాలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. 9 రోజులుగా ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా శనివారం సురేష్‌బాబు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మోసపోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కార్మికులకు లందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాకళామండలి సభ్యులు విజయ్, చంద్రప్ప సమ్మెకు సంఘీభావంగా కళాప్రదర్శనలు చేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, సూర్యనారాయణ, పుల్లయ్య, నూర్‌బాషా, ఓబుళేసు, ఈశ్వరయ్య, బాలు, రామాంజి, సంపత్, నరసింహులు, గంగాధర్, శివ, నరేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి


ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పేదలు నివసిస్తున్న ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కోరారు. పేదలు నివసించే ప్రాంతానికి విద్యుత్ సదుపాయం కల్పించాలని శనివారం ఎస్ఈ శేషాద్రిశేఖర్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి జాతీయ రహదారి పక్కన వంద బేడ, బుడగజంగం కుటుంబాలు గత రెండేళ్లుగా నివసిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్, స్టీల్ సామాన్లు, ఇతర వస్తువులు అమ్ముకుంటూ జీవిస్తున్నారన్నారు. రాత్రి పూట కుటుంబాలతో కలిసి అక్కడే నివసిస్తున్నారని, విద్యుత్ సదుపాయం లేక పిల్లలు, మహిళలు, వృద్ధులు విషపురుగులతో భయోందోళన చెందు తున్నారన్నారు. వెంటనే విద్యుత్ సదుపాయం, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ


ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్, అధికారులు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు భద్రపరచిన గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఉందని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, రాజకీయపార్టీల నాయకులతో కలిసి నగరంలోని పాత ఆర్డీఓ ఆఫీస్ కార్యాలయంలో భద్రపరిచిన ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి 3 నెలలకోసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలిసి తనిఖీ చేయాల్సి ఉంటుందన్నారు. గోడౌన్‌లో ఈవీఎం యంత్రాలు, బీయూ, సీయూలు, వీవీ ప్యాట్‌లను పరిశీలించి అనంతరం మూసివేశారు. సీ సెక్షన్ సూపరింటెండెంట్ యోగేశ్వరీదేవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కనకరాజు, బీజేపీ నుంచి ఈశ్వర్‌ప్రసాద్, కాంగ్రెస్ ఇమామ్ వలి, వైసీపీ శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీ పార్టీ మసూద్‌వలి, జనసేన పార్టీ కిరణ్ పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా ఎల్లారెడ్డి

గార్లదిన్నె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా కోటంక ఎల్లారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం బుక్కరాయసముంద్రంలోని క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవంలో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి శైలజానాథ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులను నియమించారు. గార్లదిన్నె మండల వైసీపీ కన్వీనర్‌గా కోటంక గ్రామానికి చెందిన ఎక్కలూరి ఎల్లారెడ్డిని నియమించారు. వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కోనిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించారు.

20 గొర్రెల అపహరణ

రామగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట గ్రామంలో నివసిస్తున్న చాకలిజయప్పకు చెందిన 20 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు చాకలిజయప్పకు చెందిన 20 గొర్రెలు 23వతేదీ రాత్రి పొలంలో తోలుకుని ఉండగా అవి కనపించకుండాపోయాయి. దీంతో ఆ కాపరి ఆ రోజు పలు చోట్ల గాలించారు. అవి ఎక్కడ దొరక్కపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొర్రెల విలువ రూ.1.60లక్షకుపైగా ఉంటుందని బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

కమిటీ సభ్యులకు సన్మానం



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

పామిడి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్‌గా సురేశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మా మోహన్‌కృష్ణ, చీమల రాముయాదవ్‌ని నియమిస్తూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శుక్రవారం ప్రకటించిన విషయం తెల్సిందే. ఎంపికైన వారికి మండల నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ.. శనివారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా సన్మానించారు.

ఏడీఏగా పద్మజ



రాయదుర్గం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం వ్యవసాయ సహాయ సంచాలకులుగా పద్మజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏడీఏ లక్ష్మనాయక్ సత్యసాయి జిల్లా ధర్మవరానికి బదిలీ కాగా.. ఉరవకొండ ఏడీఏ పద్మజ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

గుత్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ పాఠశాలకు చెందిన నరసింహ, వైష్ణవి, సాయికిరణ్, నీరజ్ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభచాటి.. ఇడుపలపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికయ్యారు. గుత్తికి చెందిన ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రతిష్టకుమారి శనివారం అభినందించారు.

వారి లైసెన్సు రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు స్టాంప్ బాండ్ పేపర్ విక్రయిస్తున్న వారి లైసెన్సు రద్దు చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్‌కు డీవైఎఫ్ఐ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. సామాన్యులు బాండ్ పేపర్లు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరం మేరకు కావాల్సిన బాండ్లను సరఫరా చేయడంలో విఫలమైందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీవైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, అధ్యక్షుడు చంద్ర, నాయకులు వంశీ, రంగా, ఆది, వెంకటేష్ ఉన్నారు.

రేషన్‌షాపుల తనిఖీ

కూడేరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధాన్యపు డిపోలో వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకుల పంపిణీని అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు శనివారం తనిఖీ చేశారు. మండలంలోని కల్లగళ్ల, ఇప్పేరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీపై ఆరాతీశారు. ఆయన వెంట తహసీల్దారు మహబూబ్‌బాషా, సీఎస్‌డీటీ శాంత ఉన్నారు.

● పెద్దవడుగూరు: కిష్టిపాడు గ్రామంలోని 27, 29, 48 షాపులను తహసీల్దార్ ఉషారాణి శనివారం తనిఖీచేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని సూచించారు.

గోదాములను ప్రభుత్వమే నిర్వహించాలి

గుంతకల్లుటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తిమ్మన్నచెర్ల ఎఫ్‌సీఐ గోదామును రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ లెవల్ కమిటీ డైరెక్టర్ విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కార్పొరేషన్ ఇండియా చైర్మన్ శ్రీకృష్ణదేవరాయులును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం విజయవాడలోని కార్యాలయంలో ఆయన్ను కోరారు. ప్రైవేట్ గోదాములు తొలగించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే గోదాములను నిర్వహించేలా చూడాలన్నారు.

పౌరహక్కులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బ్రహ్మసముద్రం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నేపల్లిలో తహసీల్దార్ సుమతి పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పౌర హక్కులు, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, వార్డెన్ శ్రీనివాసులు, వీఆర్వో నాగరాజు, పోలీసు రుద్రప్ప, ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి గురుపౌర్ణమి వేడుకలు

తాడిపత్రి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవనగర్‌లోని శ్రీ శివ సాయిమందిరం, శివాలయం రోడ్డులో ఉన్న శ్రీ షిర్డిసాయిబాబా మందిరాల్లో వచ్చే నెల 8 నుంచి 10 వరకు గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. 8న నగరోత్సవం, 9న అష్టోత్తర కలశ అభిషేకం, 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణం, 10న గురుపౌర్ణమి పురస్కరించుకొని అభిషేకం, శ్రీసత్యనారాయణస్వామి వ్రతం, పూర్ణాహుతి, వేదస్వస్తి తదితర వాటిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శనివారం పూజలు

బొమ్మనహాళ్, జూన్ 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి వారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని వెండి కవచంతో అలంకరించారు.

● ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో శనివారం పల్లకీసేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

● గుత్తిరూరల్: మండలంలోని కొత్తపేటలో వెలసిన నవ అహోబిల నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించి.. వివిధ పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు.

సహకార సంఘాలతో రైతుకు ఆదాయం

బెళుగుప్ప, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పరస్పర సహాయక సహకార సంఘాలతో రైతులకు లాభసాటి ఆదాయం చేకూరుతుందని రైతు ఉత్పత్తిదారుల సంఘం కో-ఆర్డినేటర్ రిజ్వాన్, సంఘం మేనేజర్ రమేష్ పేర్కొన్నారు. ఆ సంఘం 9వ వార్షిక సమావేశాన్ని స్థానిక ఎర్రితాత ఆలయం వద్ద శనివారం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవడంతో దళారుల బెడద తప్పి.. పంట ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. కావున ఈ సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సలహాదారుడు కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్



సూది గుచ్చేయ్..!

యాడికిలో స్థాయికి మించి ఆర్ఎంపీ వైద్యం

మోకాళ్ల నొప్పులకు స్టెరాయిడ్స్ ఇస్తున్న వైనం

ప్రజల ప్రాణాలతో చెలగాటం

యాడికి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ ఆర్ఎంపీ స్థాయికి మించిన వైద్యం చేస్తున్నాడు. ఏకంగా స్టెరాయిడ్స్ ఇస్తున్నాడు. మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానంటూ స్టెడాయిడ్ ఇంజక్షన్ వేస్తున్నాడు. డబ్బు కోసం జనం ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడు. ఒక ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకుడు మూడు నెలలుగా ఈ తతంగం సాగిస్తున్నాడు. ఆ ఆర్ఎంపీ వ్యవహారంపై కొందరు ఫొటోలు తీసి, జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. యాడికి ప్రభుత్వ వైద్యాధికారి పరమేశ్వర్ ప్రథమ చికిత్స కేంద్రం తనిఖీకి వెళ్లారు. రోగులకు ఆర్ఎంపీ ఇస్తున్న మందులను పరిశీలించారు. 'వైద్యనిపుణులు ఇవ్వాల్సిన మందులను ఎలా ఇస్తావం'టూ ఆర్ఎంపీని ప్రశ్నించినట్లు సమాచారం. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని హెచ్చరించి వచ్చినట్లు తెలిసింది. ప్రథమ చికిత్స కేంద్రంలో మోకాళ్ల నొప్పుల నివారణకు స్టెరాయిడ్స్ ఇస్తున్నారని చర్చించుకుంటున్నారు. తద్వారా నొప్పులకు తాత్కాలిక ఉపశమనం లభిస్తుందనీ, స్టెరాయిడ్స్ ప్రభావం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

రూ.400 నుంచి రూ.500 వసూలు

యాడికిలోని ప్రథమ చికిత్స కేంద్రంలో ఆర్ఎంపీ ఇస్తున్న స్టెరాయిడ్ ఇంజక్షన్‌తో మోకాళ్ల నొప్పులకు తాత్కాలిక ఉపశమనం లభిస్తుండడంతో రోగులు ఇతడి వద్దకు ఎక్కువగా వస్తున్నారు. యాడికితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మోకాళ్ల నొప్పుల నివారణ కోసం వృద్ధులు ఎక్కువగా వస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సదరు ఆర్ఎంపీ ఒక్కో ఇంజక్షన్‌కు రూ.400 నుంచి రూ.500 వసూలు చేస్తున్నాడు. కేవలం ప్రథమ చికిత్స అందించాల్సిన ఆర్ఎంపీ తన వద్దకు వచ్చే రోగులకు స్టెరాయిడ్స్ ఇస్తుండడం గమనార్హం. వీటి వల్ల వైద్యం వికటించి రోగులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థాయికి మించి వైద్యసేవలు అందిస్తూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్ఎంపీ ఇస్తున్న మందులు



ప్రథమ చికిత్స కేంద్రం..

వైద్యం వికటిస్తున్నా..

గతంలో మండలంలో ఆర్ఎంపీల వైద్యం వికటించి రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాడికిలో ఆర్ఎంపీ ఇచ్చిన చికిత్సతో ఓ మహిళ తీవ్ర అనారోగ్యం పాలైంది. సదరు మహిళ బంధువులు ఆ ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. ఆమె వైద్యచికిత్సల ఖర్చు భరిస్తానంటూ ఆర్ఎంపీ వారితో రాజీ కుదుర్చుకున్నాడు. రాయలచెరువులో ఒక ఆర్ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా స్థాయికి మించి వైద్యం అందిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్ఎంపీలపై వైద్యశాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



యాడికిలోని ప్రథమ చికిత్స కేంద్రంలో రోగులు

స్థాయికి మించి మందులు ఇస్తున్న మాట వాస్తవమే



యాడికిలోని ప్రథమ చికిత్స కేంద్రంలో మోకాళ్ల నొప్పుల నివారణకు ఇంజక్షన్లు వేస్తున్నారు. వైద్యనిపుణుల సూచనతో వాడాల్సిన మందులను ఆర్ఎంపీ ఇస్తున్నాడు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశాం. ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని హెచ్చరించాం. స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో నోటీసు అందజేశాం.

-పరమేశ్వర్, వైద్యాధికారి, యాడికి

విత్తన కందుల పంపిణీ



విత్తన కందులు పంపిణీ చేస్తున్న విప్ కాలవ

గుమ్మఘట్ట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంటలో ఉచితంగా విత్తన కందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు రూ. కోటి విలువచేసే కందులను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి తల్లికి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనాన్ని ప్రభుత్వం అందజేసి తన హామీని నిలుపుకుందన్నారు. ఈ సందర్భంగా తల్లికి వందనం లబ్ధిదారులతో కలిసి కేట్ చేసి.. వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, వైస్ చైర్మన్ దానవేంద్ర, కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: మండలంలోని బొమ్మక్కపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో 64 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థి ప్రకాష్ నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో టీడీపీ నాయకులు కాటా వెంకటేశులు, శ్రీనివాసులు, వెంకటస్వామి, గంగిరెడ్డి, ఈరన్న, లక్ష్మణమూర్తి, శశికుమార్, అశోక్, ఓబయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 51 మంది ఎంపిక



మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

రాయదుర్గం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 120 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 51 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంస్థ చైర్మెన్ పర్సన్ దీపక్‌రెడ్డి, నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఇందులో డీఆర్‌డీఏ సీడాప్ సావిత్రమ్మ, ఏపీ ఎస్ఎస్‌డీసీ కో-ఆర్డినేటర్ రాము పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

శెట్టూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇన్ఫినిటీ ఫౌండేషన్ గ్రామస్వరాజ్ సంస్థ మండలంలోని కైరేవులో 30, కుందుర్పి మండలం అల్లాపురంలో 30, వడ్డేపాలెంలో 30 గ్రామీణ మహిళలకు టైలరింగ్ ఉచిత శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వీరికి 50 శాతం సబ్సిడీతో శనివారం మండల కేంద్రంలో కుట్టుమిషన్లను అందజేసింది. ఇందులో సీఈవో ఫౌండర్ విజయ్ కిషోర్, ఇన్ఫినిటీ సభ్యులు వన్నూరుస్వామి, బాషా, మండల కో-ఆర్డినేటర్ అంబుజ, శిక్షకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా తాగునీటి సమస్య

పరిష్కరించాలని వజ్రవన్నూరు గ్రామస్థుల నిరసన

రాయదుర్గం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తాము నాలుగు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని మండలంలోని వజ్రవన్నూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ మహిళలు వాపోయారు. ఈ మేరకు వారు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఆరునెలల కితం శ్రీరామిరెడ్డి పథకం నీరు వచ్చేవని, నాలుగు నెలల నుంచి పంచాయతీ బోర్ నుంచి సక్రమంగా ఇవ్వకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాగునీటి కోసం రాత్రి 12 గంటల సమయంలో బిందెలు పట్టుకొని.. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోందన్నారు. తప్పనిపరిస్థితుల్లో ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 10 నుంచి రూ. 15లకు బిందె, క్యాన్లతో నీరు కొనుగోలు చేసుకుని తాగుతున్నట్లు తెలిపారు. మొహరం పండుగ వస్తోందని, అధికారులు ఇప్పటికైనా స్పందించాలని శాంతమ్మ, కమలాక్షి, కొల్లమ్మ, రుద్రమ్మ తదితరులు విజ్ఞప్తి చేశారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ఏడాది పాలనపై స్వీయ సర్వే

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఏడాది పాలనపై స్వీయ సర్వేను వచ్చే నెల రెండో తేదీ నుంచి చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. శనివారం స్థానిక పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బూత్, యూనిట్, క్లస్టర్ కమిటీలు ఇంటింటికీ వెళ్లి.. ఈ ప్రభుత్వ పాలనపై సర్వేను నిర్వహించి.. యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-సిక్స్ హామీల్లో నాలుగింటిని అమలు చేశామని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా మిగిలిన రెండింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. అనంతరం సంస్థాగత ఎన్నికల్లో నియమితులైన వారిని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేసీ హరి, బండారు రామన్న చౌదరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, అంజి పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలోని 23 మంది బాధితులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.21,64,000 మంజూరు చేసింది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారికి అందజేశారు. ఇప్పటిదాకా నియోకవర్గంలో 221 మందికి 16 విడతల్లో రూ. 1.91 కోట్ల సాయాన్ని ప్రభుత్వం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫజులుర్ రహిమాన్, రామన్న చౌదరి, పాల మల్లికార్జున గుజిరీ మహమ్మద్ ఖాజా, ఫ్రూట్ మస్తాన్, అంజి పాల్గొన్నారు.

సమావేశానికి అధికారుల డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

గుత్తిరూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విశాలాక్షి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ వెలుగు, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులు ఈ సమావేశానికి గైర్హాజర్ అయ్యారు. తమ ప్రణాళికను ప్రజాప్రతినిధులకు వివరించాల్సి ఉన్న అధికారులు.. ఇలా సమావేశానికి రాకపోవడంపై ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశంలో అధికారులు పాల్గొనకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

రేపు పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన కలగలపు బియ్యం, బేడలను సోమవారం వేలం వేస్తున్నట్లు ఈఓ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

● భూములకు వేలం : రేణుమాకులపల్లిలో సర్వే నెంబర్ 103లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 9.6 ఎకరాలకు గ్రూప్ టెంపుల్ అధికారి విజయ్‌కుమార్, పర్యవేక్షణాధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. తద్వారా రూ.1.62 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో అటెండర్ నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

రాయదుర్గంరూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక వినాయక కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జీఓ నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం రూ.24,500 ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకుంటే ముందుగా మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే జూలై 4న చలో విజయవాడ కార్యక్రమంతో పాటు నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, మైలారి, శివానంద, శ్రీనివాసులు, రాము పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

శెట్టూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకూరులో రైతు గొల్ల నరసింహప్పతన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు వేస్తూ.. విద్యుదాఘాతానికి గురై శనివారం గాయపడ్డాడు. తోటి రైతులు, గ్రామస్థులు అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ సిబ్బంది సకాలంలో ఫ్యూజులు వేయడానికి రాకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు మండిపడుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేములపాడు జాతీయ రహదారి వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు శనివారం సీజ్ చేశారు. ఆ ట్రాక్టర్‌ను యాడికి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

గుత్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన సుజాత శనివారం తెల్లవారుజామున స్థానిక రైల్వేస్టేషన్‌లో నిలబడిన రైలు నుంచి దిగుతూ జారి పడింది. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట తొలగించారని ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తన పొలంలోని కంది పంటను తన అన్న కుమారులు తొలగించారంటూ మండలంలోని దోసులుడికి గ్రామానికి చెందిన కురుబ నాగరాజుకసాపురం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. తమ అమ్మ పొలం సర్వే నెంబర్ 60లో ఎకరాను కౌలుకు తీసుకుని కందిపంట సాగుచేశానని, శుక్రవారం తన అన్న నాగేంద్ర కుమారులు రాజు, ధనుంజయలు ట్రాక్టర్‌తో ఆ పంటను దున్నివేశారని వాపోయారు.


నిందితుడి అరెస్టు

పామిడి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణస్వామి వీధి శివారు ప్రాంతంలో ఈ నెల 21న అనుమానాస్పదస్థితిలో వివాహిత రాజేశ్వరి మరణించిన విషయం తెల్సిందే. ఈ కేసులో నిందితుడైన పట్టణానికి చెందిన వంగనూరు భాస్కర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపరచి.. రిమాండ్‌కు తరలించామన్నారు.

మహిళపై దాడి

గుత్తిరూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబిచేర్ల గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన ఆ గ్రామానికి చెందిన ఓబులేసు, భార్య అంజలి డాబా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి డాబాలో ఉన్న అంజలిపై దాడి చేశారు. ఆమె కేకలు వేయడంతో.. పక్క ఉన్న వారు వచ్చే సరికి ఆ వ్యక్తులు బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. వారు పోలీసులకు సమాచారం అందించి.. అంజలిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆ బైక్‌ను స్వాధీనం చేసుకొని.. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కుక్కల బెడద నివారించండి



మున్సిపల్ భవన ప్లానింగ్ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

గుత్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధికుక్కల బెడద అధికమైందని, వాటిని నివారించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని కౌన్సిలర్ వరదరాజులు అధికారులపై ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో చైర్ పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన కౌన్సిలర్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ... పట్టణంలో పారిశుధ్యం లోపించిందని, దోమలు అధికమయ్యాయని, ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ఎందుకు వినియోగించడం లేదని అధికారులను నిలదీశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్‌బాష మాట్లాడుతూ.. కుక్కలను నియంత్రిస్తామని, చెత్తను తొలగించి.. ఫాగింగ్ చేస్తామన్నారు. అదే విధంగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రూ.2 కోట్లతో నిర్మించబోయే మున్సిపల్ భవనానికి సంబంధించి ప్లానింగ్ చార్ట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఈ హేమచంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి మారుతి ప్రసాద్, మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

దండోర మండల కమిటీ ఏర్పాటు

విడపనకల్లు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ పాఠశాలలో అనంతపురం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ముమ్మడి వరపు చిన్ని సుబ్బారావు దండోర నాయకులతో శనివారం సమావేశాన్ని నిర్వహించి.. మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీ కొత్తకోటకు చెందిన మీనుగ వన్నూరుస్వామి, ఉపాధ్యక్షుడిగా ఉండబండ భూపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరగోపాల్, విడపనకల్లు ఇన్‌చార్జి కొత్తకోట ఎర్రిస్వామి, మల్లేల ప్రకాశ్, రాజ్‌కుమార్, భూపతి పాల్గొన్నారు.



దండోర మండల కమిటీ నూతన సభ్యులు